# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అతిథులకు లేపాక్షి కళాకృతులను జ్ఞాపికలుగా ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**
3. **తెలంగాణలో అక్టోబరు నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
4. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ నాణ్యతపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.**
5. **ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు జయంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సమావేశాలకు, కార్యక్రమాలకు హాజరయ్యే అతిథులకు లేపాక్షి కళాకృతులను జ్ఞాపికలుగా ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా లేపాక్షి సంస్థలో ఉన్న కళాకృతులను నిన్న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, రాష్ట్రం తరపున ఇతర రాష్ట్రాలకు, దేశ రాజధానికి వెళ్లినప్పుడు మర్యాద పూర్వకంగా ఇచ్చే జ్ఞాపికలు లేపాక్షి నుంచే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. నిన్న విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలలో సంబంధిత అధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అనుసరించాల్సిన విధివిధానాలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కార్యశాలలను నిర్వహిస్తామన్నారు. కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతికతను ఉపయోగించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో రవాణాకి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

-------------------------

తెలంగాణలో అక్టోబరు నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం నిన్న సమావేశమైంది. సమావేశం అనంతరం మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రికేయులకు వెల్లడించారు.జనవరి నుంచి అన్ని రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యాన్ని అందిస్తామని, ఈ ఖరీఫ్ నుంచి కనీస మద్దతు ధరకి అదనంగా 500 రూపాయలను చెల్లించి సన్నాలు కొనుగోలు చేసేందుకు మంత్రి వర్గం నిర్ణయించిందని తెలిపారు. మిగిలిన శాఖలకు ఉండే పూర్తి స్వేచ్ఛ హైడ్రాకు కూడా ఉంటుందని, ఈ మేరకు నిబంధనలను సడలించామన్నారు. మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు, హ్యాండ్లూమ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం గులదుర్తి గ్రామంలో నిన్న నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ ను అమలు చేశామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 437 పోస్టుల భర్తీకి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని, . జిల్లాలోని బనగానపల్లిలో త్వరలో అన్నా క్యాంటీన్ ను ప్రారంభించనున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ నాణ్యతపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. నిన్న గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో దశాబ్దాల తరబడి ఒకే విధానంలో లడ్డూ తయారీ సామాగ్రీ కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని, ఈ ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు అవకాశం ఉండదని వెల్లడించారు.

---------------------------

తెలంగాణలోని సింగరేణి సంస్థకు 2023-24 ఏడాదిలో 4 వేల 701 కోట్ల రూపాయల లాభం వచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిన్న హైదరాబాదులో ఆయన మాట్లాడుతూ,సింగరేణి లాభాల్లో సంస్థ కార్మికులకు 796 కోట్ల రూపాయలను అదనపు వేతనంగా ప్రకటిస్తున్నట్టు చెప్పారు. తద్వారా సగటున ఒక్కో కార్మికుడికి 1.90లక్షలు అదనపు నగదు లభిస్తుందని తెలిపారు. దసరా పండగ కంటే ముందే బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతేడాది కంటే అదనంగా బోనస్ ప్రకటించామని, సింగరేణి సంస్థలో తొలిసారిగా ఒప్పంద ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

తిరుపతి లడ్డూలో కల్తీపై ఆరోపణల వస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వం నివేదిక కోరింది. నిన్న ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా మాట్లాడుతూ, ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి నివేదిక కోరామని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుపతి లడ్డూలో కల్తీ అంశం తీవ్రమైన విషయమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ, ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

---------------------------

ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతిపురం మన్యం జిల్లా సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో నిన్న నిర్వహించిన “ఇది మంచి ప్రభుత్వం” కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో పలు ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టిందన్నారు.వంద రోజుల కాలంలో ప్రజలకు సుపరిపాలన అందించామని, సమర్ధవంతంగా పింఛన్లను పంపిణీ చేశామని మంత్రి వివరించారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, మొదటి 100 రోజుల్లో ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకి ప్రసారమవుతుంది.

---------------------------

దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని జాతీయ సమగ్రత గురించి తెలిపిన నవయుగ వైతాళికుడు ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు జయంతి ఈరోజు. 1862 సెప్టెంబర్ 21 జన్మించిన ఆయన తన రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు. కన్యాశుల్కం, ముత్యాలసరాలు, పుత్తిడిబొమ్మ పూర్ణమ్మ, వంటి రచనల ద్వారా సాంఘిక దురాచారాలపై సమాజాన్ని జాగృతం చేసిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు. 19, 20వ శతాబ్దాలలో ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో ఆయన చేసిన రచనలు.. ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. ఆయన రచించిన “కన్యాశుల్కం” నాటకం సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది.

---------------------------

పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క తెలిపారు. హైదరాబాద్ లో సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధి పనులకు వెళ్లే స్త్రీల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో టీ సేఫ్ యాప్‌ను పోలీసు శాఖ తీసుకొచ్చిందని చెప్పారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రపంచ దేశాలు పరస్పరం సమైక్యతా భావంతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ ఈరోజు అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి సర్వ సభ్య సమావేశం చేసిన తీర్మానం మేరకు 1982 వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.. ప్రతి ఒక్కరూ ఆనందంతో ..., సుఖ శాంతులతో జీవనం సాగిస్తే ఆ దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని ..., ప్రపంచ దేశాలు కూడా శతృత్వ వైఖరి విడనాడి సోదర భావంతో మెలగాలని చాటి చెప్పడమే అంతర్జాతీయ శాంతి దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

=======================